### ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతం

జగిత్యాల అగ్రికల్చర్, ఫిబవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు రోజులుగా జరుగుతున్న ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల కన్వీనర్ నారాయణ తెలిపారు. జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాలలో ఉదయం 246 మంది విద్యార్థులకు గాను 239మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 241 మంది విద్యార్థులకు గాను 233 మంది హాజరైనట్లు ఆయన తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, పొరండ్ల, సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు ఉన్నందున శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు పొరండ్ల, కన్నాపూర్, బాలపల్లి, కన్నాపూర్, బాలపల్లి, కండ్లపల్లి, హన్మాజీపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ సుందర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

● రాయికల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్ గల 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని రాయికల్ ఏఈ తెలిపారు. వీరాపూర్ పరిసర ప్రాంతాల ప్రజలు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# లక్ష్యం నెరవేరేనా..?



- జిల్లాలో రూ.12.48 కోట్ల పన్ను వసూళ్లు టార్గెట్
- ఇప్పటి వరకు 61 శాతం పూర్తి
- వివిధ సర్వే పనుల్లో కార్యదర్శులు బిజీ
- మార్చి31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- అధికారులు ప్రణాళికతో ముందుకు సాగితేనే ఆదాయం

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీల్లో ఇంటిపన్నుల వసూళ్లు నత్తనడకన సాగుతుండడంతో ఆశించిన లక్ష్యం నెరవేరేనా అనే అనుమానాలు కలుగుతున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు నిర్దేశించిన లక్ష్యంలో 61శాతం మాత్రమే వసూలైంది. ఏ గ్రామ పంచాయతీ సైతం లక్ష్యానికి చేరువలో లేదు. మరో వైపు మార్చి31తో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. దీంతో అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు కార్యదర్శులు కొట్టుమిట్టాడుతున్నారు. పంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్పస్ ఉద్యోగులకు నెల వారీగా వేతనాల చెల్లింపు ఇబ్బందికరంగా మారింది. ఈ క్రమంలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయాన్ని అత్యవసర పనులకు వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు వివిధ సర్వే పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

**● ఇప్పటి వరకు రూ.7.56 కోట్లు వసూలు**

జిల్లాలోని 18 మండలాల్లో గత సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ యేడాది ఫిబ్రవరి 7వ తేదీ వరకు కేవలం 61 శాతం మాత్రమే పన్ను వసూలైంది. జిల్లా వ్యాప్తంగా రూ.12,48,85,209 పన్ను వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 7,56,28,157 వసూలు చేశారు. జిల్లాలో అత్యధికంగా కోరుట్ల మండలంలో 77 శాతం పన్ను వసూలు కాగా, అత్యల్పంగా ఇబ్రహీంపట్నం, బుగ్గారం మండలాల్లో 45 శాతం వసూలైంది. ఈఆర్థిక సంవత్సరానికి కేవలం 50 రోజుల ...

మిగతా 8లో

**మండలాల వారీగా ఇంటి పన్ను వసూళ్ల వివరాలు (రూ.లలో)**

| మండలం | లక్ష్యం | వసూళ్లు | శాతం |
|---|---|---|---|
| కోరుట్ల | 81,44,820 | 62,68,503 | 77 |
| పెగడపల్లి | 42,70,798 | 29,21,477 | 68 |
| గొల్లపల్లి | 39,95,490 | 26,75,178 | 67 |
| మెట్‌పల్లి | 97,89,95 | 65,55,255 | 67 |
| వెల్గటూరు | 55,16,722 | 36,93,669 | 67 |
| రాయికల్ | 75,51,398 | 50,92,184 | 67 |
| మల్యాల | 1,09,41,037 | 72,19,841 | 66 |
| జగిత్యాల | 42,26,990 | 26,49,954 | 63 |
| సారంగపూర్ | 29,19,118 | 18,09,002 | 62 |
| దర్మపురి | 50,06,901 | 30,68,137 | 61 |
| మేడిపల్లి | 76,62,468 | 47,07,424 | 61 |
| జగిత్యాలరూరల్ | 1,12,60,547 | 66,44,930 | 59 |
| మల్లాపూర్ | 1,18,31,144 | 67,66,238 | 57 |
| బీర్‌పూర్ | 23,98,514 | 13,23,457 | 55 |
| కథలాపూర్ | 92,77,785 | 49,70,684 | 54 |
| కొడిమ్యాల | 78,11,216 | 37,55,880 | 48 |
| ఇబ్రహీంపట్నం | 99,01,220 | 44,42,540 | 45 |
| బుగ్గారం | 23,79,090 | 10,63,804 | 45 |
| మొత్తం | 12,48,85,209 | 7,56,28,157 | 61 |

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు

● కలెక్టర్ బి.సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య రాకుండా జిల్లాలో చర్యలు చేపట్టాలని కలెక్టర్ బి.సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో అన్ని మండలాల పరిధిలోని మిషన్ భగీరథ అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్, ఇబ్బందులు తదిరర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇంట్రాలో లీకేజీ, మరమ్మతు వంటి పనులు ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వాటర్ డ్రింగ్ ఎస్సారెస్పీ పైపులైన్ బల్క్ సమస్య నెల రోజుల్లో పూర్తవుతుందన్నారు. గ్రిడ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పనులకు సంబంధించి తన దృష్టికి తీసుకువస్తే వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ నీటి వనరుల ప్రాజెక్టులలో తాగునీరు సరఫరాకు వీలుగా వాటర్ లెవల్స్ మెయింటనెన్స్ చేయాలన్నారు. తాగునీటి సరఫరాకు సంబంధించి లీకేజీలు, పంపు మరమ్మతులు ఏమైనా ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లాలోని ఆయా మండలాలవారీగా ఇంటి పన్ను చెల్లింపు శాతం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో కచ్చితంగా 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను రెండు దశల్లో స్థానిక సంస్థల నిర్వహణ ఉంటుందని, ఎన్నికల నోటిఫికేషన్ ఏ సమయంలో వచ్చినా ఎంపీడీవోలు, ఎంపీడీవోలు తమ తమ పరిధిలోని ఓటర్ల జనాభా, ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా, పురుషులు, మహిళల ఓటరు లిస్టును, పోలింగ్ స్టేషన్లను, కౌంటింగ్ సెంటర్లను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.గౌతమ్ రెడ్డి, డీపీవో మదన్‌మోహన్, డీఈఈ, మిషన్ భగీరథ అధికారులు, ఏఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

కథలాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుంపెట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూగజీవాలను సంరక్షించుకోవాలని. జంతు బలులు చట్ట విరుద్ధమని అన్నారు. పక్షులకు నీరు, ఆహారం అందించాలని సూచించారు. ఎడ్లబండ్లపై అధిక భారం మోపి పశువులకు శక్తికి మించి బరువు వేయరాదన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ముగ్గురు విజేతలకు డిక్షనరీలు అందజేశారు. ఈకార్యక్రమంలో పశువైద్యాధికారిణి దివ్యశ్రీ, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# ఎస్సీ వర్గీకరణ చరిత్రాత్మకం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చరిత్రాత్మకం అని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రజల అభిప్రాయం మేరకు కులగణన చేసినట్లు ఆయన అన్నారు. ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగే విధంగా కమిటీని నియమించి ప్రజల అభిప్రాయం సేకరించారన్నారు. ముప్పై ఏళ్ల ఎస్సీల ఆకాంక్ష అయిన ఏబీసీడీ వర్గీకరణ కోసం అసెంబ్లీ సమావేశంలో చర్చించి ఆమోదించడం దళిత ఎమ్మెల్యేగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయలేదని, సుప్రీంకోర్టులో తీర్పు వచ్చిన వెంటనే తమ నాయకుడు అసెంబ్లీలో ఆమోదించినట్లు ఆయన పేర్కొన్నారు. బీసీ కుల గణన చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే దక్కిందన్నారు. బీసీ కుల గణన నివేదికపై వివాదస్పద వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు పార్టీ షోకాజ్ నోటీస్ జారీ చేసిందని , అదంతా హైకమాండ్ చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, బుగ్గారం మాజీ జడ్పీటీసీ బాదినేని రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, నియోజకవర్గ స్థాయి మండలాల అధ్యక్షులు వేముల సుభాష్, తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, ముస్కు నిశాంత్‌రెడ్డి, బుర్ర రాములుగౌడ్ పాల్గొన్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి విప్ అడ్లూరి పూల మాల వేసిన అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీల ముప్పై ఏళ్ల కల సాకారం అయ్యేల వర్గీకరణ బిల్లు ఆమోదంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్‌రెడ్డి, మద్దుల గోపాల్‌రెడ్డి, గూడ రాంరెడ్డి, మెరుగు మురళి, నిశాంత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, పూదరి రమేష్, బందెల ఉదయ్, వెంకటేష్, పోలోజు శ్రీనివాస్, రంగు తిరుపతి, నరేష్ గౌడ్, మంజుల పాల్గొన్నారు.

### ఎన్‌హెచ్63 పనులు త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ సత్యప్రసాద్

8

### అమ్మ ఆదర్శ పాఠశాలలకు నిధులు విడుదల చేయాలి

● సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధప్రాంతాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడానికి పూర్తి చేసిన పనులకు సంబంధించిన రూ.18.74కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి లేఖను రాశారు. జిల్లాలోని517 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పథకం కింద పనులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో పూర్తి చేశారన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఇప్పటికే రూ.10.70 కోట్లు నిధులు విడుదల చేయగా, మరో రూ.18.74కోట్లు విడుల చేయాల్సి ఉందన్నారు. సంబంధిత నిధులు విడుదల కాకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి పంపిన లేఖలో ఎమ్మెల్సీ కోరారు.

### ఘనంగా ప్రారంభమైన బీర్‌పూర్ జాతర



స్వామివారి ఊరేగింపు పల్లకిసేవలో పాల్గొన్న భక్తులు

బీర్‌పూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారం భం అయ్యాయి. బ్రహ్మోత్సవాలు ఈనెల 19న ముగియనున్నాయి. స్వామివారి ఊరే గింపు, పల్లకి సేవ కార్యక్రమాన్ని అర్చకులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ చైర్మన్‌లు కేశవులు, సామ్రాట్, ఎస్సై కుమార స్వామి, అర్చకులు సంతోష్, మధుకుమార్, సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

### విపత్తుల నివారణపై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

మల్యాల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో విపత్తుల నివారణపై భక్తులకు అవగాహన కల్పించారు. వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై ప్రదర్శనలతో వివరించారు. అత్యవసర సమయాల్లో సీపీఆర్, గాయపడిన వారికి ప్రథమ చికిత్స, వారని ఆసుపత్రికి తరలింపు తదితర వాటిపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పదవ బెటాలియన్ కమాండెంట్ ముఖేష్ కుమార్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో, విపత్తులు ఎదురైనప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవడం ద్వారా విపత్తులను నివారించే అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికి విపత్తుల నివారణపై అవగాహన ఉండాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ మునీందర్, ఎస్సై నరేశ్‌కుమార్, వైద్యాధికారి మౌనిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, ఆలయ పర్యవేక్షకులు సునీల్, హరిహరనాథ్, పంచాయితీ కార్యదర్శి స్వప్న వివిధ శాఖల సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# నులి పురుగు మాత్రలు వేయించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ఫ్రిబవరి, 7 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 10న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. 1-19 సంవత్సరాల లోపు పిల్లలందరికి తప్పనిసరిగా మాత్రలను వేయించాలన్నారు.

●పెగడపల్లి: జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నులిపురుగు మాత్రల పంపిణీ కార్యక్రమంపై కార్యక్రమం టాస్క్‌ఫోర్స్ సభ్యులతో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల వైద్యాధికారి నరేష్, సీహెచ్ఓ మహేందర్ రెడ్డి, నాయబ్ తహసీలార్ లాస్యశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్లు జయశీల, సుభద్ర, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలో ఈ నెల 10న చిన్నారులకు నులి పురుగు మాత్రలు వేయించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సింధూజ కోరారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని 9 గ్రామాల్లో 6976 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. రెండేళ్ల లోపు చిన్నారులకు 200 ఎంజీ, 19 ఏళ్ల లోపు వారికి 400 ఎంజీ మాత్రలు ఇవ్వాలని సూచించారు. మిగిలి పోయిన వారికి 17న మాత్రలు పంపిణీ చేయాలన్నారు.

### ఎరువుల గోదాంలో తనిఖీ



గంభీర్‌పూర్‌లో ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న ఏవో యోగిత

కథలాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంబీర్‌పూర్ సింగిల్‌విండో ఎరువుల గోదాంను శుక్రవారం మండల వ్యవసాయాధికారిణి యోగిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల కొరత ఏర్పడిన నేపథ్యంలో వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించినట్టు ఏవో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఉన్న స్టాక్‌కు గోదాంలో ఉన్న నిల్వకు తేడా ఉన్నందు వల్ల వాటిని సరిచేసుకోవాలని సీఈవో విజయ్‌కు సూచించామన్నారు. అందుకుగాను 15రోజుల పాటు విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించినట్టు ఏఓ చెప్పారు. ఎప్పటికప్పుడు రైతులకు విక్రయించిన సమయంలో రిజిష్టర్‌లో నమోదు చేసుకోవాలని సూచించినట్టు పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి


హర్షవర్ధన్(ఫైల్)

మంథని, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగాపురి సమీ పంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడు ప్రమాదంలో బోయిని పేటకుచెందిన ఇంటర్‌విద్యార్థి మిర్యాల హర్షవర్ధన్ (17)అనే బాలుడు మృతిచెందాడు. బోయినిపేటకు చెందిన మిర్యాల రాజు-స్వరూప దంపతుల కుమారుడు మిర్యాల హర్షవర్ధన్ ముత్తారం మండ లంలోని దర్యాపూర్ మోడల్ జూని యర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీవిభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హర్షవర్ధన్ ఏపీ 15క్యూ 4780అనే ద్విచక్ర వాహనంపై గంగాపురి నుంచి మంథ ని వైపు వస్తుండగా రైస్‌మిల్లు సమీపంలో మంథని నుంచి పెద్దపల్లి వైపువెళ్తున్న బొలెరో వాహనం హర్షవర్ధన్ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. హర్షవర్ధన్ వెనుక నుంచి వస్తున్న ట్రాక్టర్‌కు తగలడంతో కిందపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న హర్షవర్ధన్‌ను స్థానికుల సమాచారం మేరకు 108లో ప్రభుత్వఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు. హర్షవర్ధన్ కుటుంబ సభ్యులంతా ఓ శుభకార్యం కోసం కరీంనగర్‌కు వెళ్లగా విషయం తెలుసుకొని హుటాహుటిన మంథనికి చేరుకున్నారు. రాజు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉండగా కుమారుడి మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన వాహనాలను పోలీ సులు స్టేషన్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### చికిత్స పొందుతూ కౌలు రైతు..

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామానికి చెందిన నెల్లి శంకరయ్య(65) కౌలు రైతు గురు వారం పురుగులమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడ్డాడు. పోలీస్‌లు, కుటుంబ సభ్యులుతెలిపిన వివరాలప్రకారం.. శంకరయ్య మూడు సంవత్సరాలుగా గ్రామంలో మూడు ఎకరాల వ్యవసాయభూమి కౌలుకు తీసుకొని వరి సాగుచేస్తున్నాడు. దిగుబడిసరిగా రాక అప్పులపాలయ్యాడు. తీవ్రమన స్థాపానికి గురైన శంకరయ్య గురువారం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

# చివరి ఆయకట్టు సాగు కలేనా..


ఆగిపోయిన కాలువ పనులు

**గత ప్రభుత్వంలో రూ.12.14 కోట్ల నిధులతో పనులు ప్రారంభం**
**ప్రభుత్వం మారడంతో అర్ధాంతరంగా నిలిచిన పనులు**
**కలగా మారిన 15 వేల ఎకరాల స్థిరీకరణ లక్ష్యం**

ధర్మారం ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మూడు మండలాల రైతుల పంటల సాగే లక్ష్యంగా చేపట్టిన లింక్ కాలువ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో చివరి ఆయకట్టు సాగు కలగా మారింది. రూ.12.14 కోట్లతో 15 వేల ఎకరాల స్థిరీకరణే లక్ష్యంగా లింక్ కాలువ పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. అనంతరం ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో తలాపునే గోదావరి ఉన్న రైతుల పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది.


కాలువపై నిర్మించిన బ్రిడ్జి

ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలాల రైతుల పంటపొలాలకు ప్రధాన నీటి వనరు ఎస్ఆర్ఎస్‌పి 83బీ కాలువ. ఈ కాలువ ధర్మారం మండలం మల్లాపూర్‌లో మొదలై ధర్మారం, ఎండపల్లి, వెల్గటూర్ మండలంలోని చెగ్యాం వరకు 34 కిలోమీటర్ల మేర ఉంటుంది. మల్లాపూర్ వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటర్ నుంచి ఈ కెనాల్ ద్వారా 188 క్యూసెక్కుల నీరు విడుదల కావాలి. కాని 70 నుంచి 100 క్యూసెక్కుల నీరు మాత్రమే విడుదల చేస్తున్నారు. దీంతో యేటా ఆయా మండలాల రైతుల చివరి ఆయకట్టుకు నీరందక పొలాలు ఎండిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా మేడారం రిజర్వాయర్ నుంచి ఎస్ఆర్ ఎస్‌పి 83బీ కాలువకు లింక్ చేసి నీరందించాలని సంకల్పించింది. ఈ లింకు కాలువ ద్వారా 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ధర్మారం మండల కేంద్రం శివారులోని 10.2 కిలోమీటర్ వద్ద కలుపుతారు.

ఈ ఉద్దేశ్యంతో 2023లో రూ.12.14 కోట్ల నిధులు కేటాయించి హుటాహుటిన పనులు ప్రారంభించారు. అదే సంవత్సరం పనులు చేపట్టిన కాంట్రక్టర్ తూమ్ నిర్మాణంతో పాటు కాలువ తవ్వకం పనులు చేశారు. ఇంతలో ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడం, ఇంత వరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు బిల్లులు రాక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. యేటా వెల్గటూర్ మండలంలోని ముంజంపల్లి, మారేడుపల్లి, చెగ్యాం, ఉండెడ గ్రామలలోని వేల ఎకరాల్లో చివరి ఆయకట్టు ఎండిపోతుంది. రాజకీయ నాయకులు పంటలను పరిశీలించడం, వారికి తాత్కాలిక ఉపశమనం కలిగేల ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని అందించడం నాయకులకు పరిపాటిగా మారింది. ఇప్పటికైనా నాయకులు స్పందించి నిలిచిపోయిన లింక్ కాలువ పనులు చేపట్టి మూడు మండలాల రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

### మార్చిలో పనులు ప్రారంభిస్తాం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్.



గత ప్రభుత్వంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరు మీద మన నీళ్లను సిరిసిల్ల, సిద్దిపేట, హైదరాబాద్‌లకు తర లించి ఇక్కడి రైతులకు అన్యాయం చేశారు. బీఆర్ఎస్ ప్రభు త్వం చేసిన తప్పిదాల వల్ల ఇప్పటి వరకు చేప ట్టిన ప్రాజెక్టుల ఖర్చు మూడింతలు పెరిగింది. అయి నప్పటికి ఈ ప్రాంత ప్రజల కోసం పెండింగ్‌లో ఉన్న ప్రతీ పనిని చేపడుతాం. మేడారం లింక్ కాలువ పనులు కూడా మార్చి నెలలో చేపట్టి వీలైనంత తొంద రగా పూర్తి చేస్తాం. మూడు మండలాల ప్రజల చివరి ఆయకట్టు వరకు నీరందించే బాధ్యత నాది.

### షేక్ సాబీర్‌అలీ రిమాండ్

జమ్మికుంట, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలు సృష్టించి పట్టాభూమి కబ్జా చేసేందుకు ప్రయత్నించిన కాటిపల్లి రాజు, అతడికి సహకరించిన షేక్ సాబీర్‌అలీని పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 464సర్వే నంబ ర్‌లో ఎండీ అరిఫుద్దీన్‌కు పట్టాభూమి ఉందన్నారు. కాటిపల్లి రాజు, కాటిపల్లి సంధ్య, కాటిపల్లి లక్ష్మి ఫోర్జరీ సంతకా లతో నకిలీపత్రాలు సృష్టించి సదరు భూమిలో టెంటు వేసి నిరాహార దీక్షకు దిగి యాజమానిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అరిఫుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు నలుగురిపై కేసు నమో దు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

### గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న ఇద్దరి అరెస్టు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): రామగిరి మండలం సింగిరెడ్డిపల్లె గ్రామంలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్న ఇద్దరిని గురువారం రాత్రి గోదావరిఖని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని జక్కటి ఎర్రక్క ఇంటి సమీపంలో పూజలు చేస్తుండడంతో అను మానించిన గ్రామస్థులు పోలీసులకు సమా చారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తవ్వకాలు జరుపుతున్న మంథనికి చెందిన పోగుల శ్రీనివాస్, మద్దిపాటి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసు కున్నారు. వారివద్ద తవ్వకాలకు ఉపయో గించిన సామాగ్రిని స్వాధీనం చేసుకు న్నారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు సీఐ ప్రసాద రావు తెలిపారు.

### ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో ఆగిఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొని ఓవ్యక్తి అక్కడికక్కడేమృత్యువాత పడ్డాడు. ఇల్లందకుంటకు చెందిన పెద్ది భాస్కర్(35) పెద్దపల్లిలో ఓప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే బైక్‌పై ఉద్యోగానికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కోరపల్లి గ్రామంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌నుఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడేమృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, నాలుగు సంవత్సరాల కుమార్తె ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

### పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామసమీపంలో అక్రమంగా నిల్వఉం చిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన గంటఎల్లయ్య పీడీఎస్ బియ్యా న్ని సేకరించి నిలువ చేశాడనే సమా చారం మేరకు శుక్రవారం దాడిచేసినట్లు తెలిపారు. ఎల్లయ్య వద్ద 8క్వింటాళ్ల బియ్యం లభించగా నిందితుడి అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

### రికార్డులను ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

చందుర్తి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ గ్రామం లోని అంబేద్కర్ యువజన సంఘం భవనంలోని రికార్డులను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం రాత్రి తగలబెట్టారు. సంఘం సభ్యుల కథనం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు సంఘం భవనం తలుపుల తాళం పగలగొట్టి భవనంలో ఉన్న ట్రంక్‌పెట్టెను బయటపడేసి సం ఘం రిజిస్ట్రేషన్, రిజిస్టర్లు, లెటర్ ప్యాడ్ లను తగలబెట్టారన్నారు. దుండగులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

# న్యూపోరట్‌పల్లిలో విషాదం

- గజ్వేల్‌లో రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి
- కాంగ్రెస్ నేత, అతని మేనల్లుడు దుర్మరణం


లింగమూర్తి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



మెరుగు లింగమూర్తి, ముష్కే బీనేష్(ఫైల్)

జ్యోతినగర్, ఫిబ్రవరి 7(ఆంధ్ర జ్యోతి): గోదావరిఖని నుంచి హైదరా బాద్‌కు కారు అద్దెకుతీసుకొని బయలు దేరిన వారు కొన్నిగంటల వ్యవధిలోనే విగతజీవులుగా మారారు. వివరాలు ఇలా ఉన్నాయి. న్యూపోరట్‌పల్లికి చెందిన మేరుగు లింగమూర్తి (48), అతనిసోదరుడు మహేశ్, లింగమూర్తి మేనల్లుడు ముష్కే బీనేష్ (28)లు వ్యక్తిగత పనికోసం శుక్రవారం తెల్ల వారుజామున బయలుదేరారు. రాత్రి వరకు తిరిగి వస్తామని పేర్కొన్నారు.

కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా ఉదయం 5గంటలసమయంలో గజ్వేల్ వద్ద ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఈప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో లింగమూర్తి, అతనిమేనల్లుడు బీనేష్ మృతిచెందగా లింగమూర్తి తమ్ముడు మహేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రణయ్‌సాగర్ స్వల్పంగా గాయపడ్డారు. మెరుగు లింగమూర్తి కాంగ్రెస్ పార్టీ ఎన్టీపీసీ పట్టణ ప్రధానకార్యదర్శిగా పని చేస్తున్నారు. రాత్రివరకు తిరిగి వస్తామని ఇంటినుంచి బయలు దేరిన కుటుంబసభ్యులు తిరిగిరాని లోకాలకు వెళ్లారని తెలిసి ఆ కుటుంబసభ్యులు కన్నీరు మున్నీ రయ్యారు. మృతుడు లింగమూర్తికి భార్య భూలక్ష్మి, కుమార్తెలు అఖిల, అమూల్య, కొడుకు అభిషేక్ ఉన్నారు. కాంగ్రెస్‌పార్టీ స్థానిక సోషల్ మీడియాసెల్ బాధ్యతలు చూస్తున్న బీనేష్‌కు తల్లి దండ్రులు చిన్నమ్మ, మల్లేష్ ఉన్నారు. బీనేష్ అవివాహితుడు.

**కాంగ్రెస్ నేతల మృతికి ఎమ్మెల్యే సంతాపం..**

కాంగ్రెస్ నాయకుడు లింగమూర్తి, బీనేష్ మృతి పట్ల రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, పార్టీ నాయకులు భరత్‌గౌడ్, ఎండీ ఆసిఫ్‌పాషా తదితరులు సంతాపం వ్యక్తంచేశారు. కాగా, మృతదేహాలకు పోస్టుమార్టం చేసిన అనంతరం సాయంత్రం ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లికి తీసుకు వచ్చారు. శనివారం అంత్యక్రియలు జరిపేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## జగిత్యాలలో ఏసీబీ సోదాలు

- ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని హన్మకొండ డీటీసీపై ఫిర్యాదులు
- ఇంట్లోని పలు రికార్డులు స్వాధీనం


సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

జగిత్యాలక్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల జిల్లాకేంద్రంలో శుక్రవారం హన్మకొండ జిల్లా డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిం చారు. జగిత్యాలలోని విజయపురి కాలనీకి చెందిన పుప్పాల శ్రీనివాస్ హన్మకొండ జిల్లాలోని రవాణా శాఖలో డిప్యూటిట్రాన్స్‌పోర్ట్ కమిషన ర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని ఏసీబీకి ఫిర్యాదు వచ్చింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా శ్రీనివాస్‌కు సంబంధించిన కుటుంబ సభ్యులు, సన్నిహితుల ఇళ్లలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. జగిత్యాలలో శ్రీనివాస్ తండ్రి రాంచంద్రం ఇంటిలో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. రెండు గంటలకుపైగా సోదాలు నిర్వహించిన అధికారులు పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

### మద్యం మత్తులో ఆర్టీసీ మహిళా కండక్టర్‌పై దౌర్జన్యం

- ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు

రామగిరి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఆర్టీసీ మహిళా కండక్టర్ పై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకుమార్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి కరీంనగర్ నుంచి మంథని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సెంటినరీకాలనీలోని తెలంగాణ సెంటర్‌కు చేరుకుంది. కారులో ఆర్టీసీ బస్సును వెంబడిస్తున్న గుండారం గ్రామానికి చెందిన రాచకొండ రవి, మోతె రాజయ్యలు కారును బస్సుకు అడ్డంగా నిలిపి డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగడంతో పాటు మహిళా కండక్టర్ పై దురుసుగా ప్రవర్తించి దౌర్జన్యానికి దిగడంతో స్థానికులు అడ్డుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువురి పై కేసు నమోదు చేసి కార్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


శ్యామ్ సుందర్ (ఫైల్)

అంతర్గాం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి శివారులో ఎగువ వైపు పట్టాలపై ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి సిద్ధ శ్యామ్‌సుందర్(34) అనే యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. రైల్వే జీఆర్పీ రామగుండం ఇన్‌చార్జి తిరుపతి తెలిపినవివరాల ప్రకారం కుందన పల్లికి చెందిన శ్యామ్ సుందర్ ఎన్టీపీసీ యాష్‌పాండ్‌లో కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నాడు. శ్యామ్‌సుందర్ మద్యానికి అల వాటు పడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది జీవితంపై విరక్తి కలగడంతో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్యకూతురు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తిరుపతి పేర్కొన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యా దుమేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు జీఆర్పీఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

### కోర్టు సమన్లు ధిక్కరించిన ఐదుగురికి జైలు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కోర్టు సమన్లు ధిక్కరించిన ఐదుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి వారంరోజుల చొప్పున జైలుశిక్ష విధిస్తూ జగిత్యాల జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ శుక్రవారం తీర్పునిచ్చారు. పెగడపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పరిసె రాయమల్లు, నామసాని రాజయ్య, నామసాని రాజ్ కుమార్, ఎనగందుల విక్రమ్, సట్ట నాంపెల్లి అనే ఐదుగురు వ్యక్తులు పలు కేసుల్లో కోర్టునుంచి సమన్లు పొంది కేసువిచారణకు గైర్హాజరవుతు న్నారు. కోర్టు ఆదేశాలు లెక్కచేయకుండా తప్పించుకు తిరుగుతున్న ఐదుగురు వ్యక్తులపై కోర్టు వారంట్ జారీ చేసింది. పెగడపెల్లి ఎస్సై రవి కిరణ్ శుక్రవారం ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. దీంతో న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించి జైలు శిక్ష విధించారు.

### ఆయుర్వేద కంపెనీ యజమానికి నెల రోజుల జైలు శిక్ష

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌అండ్‌మ్యాజిక్ రెమడీస్ యాక్ట్-1954 ధిక్కరణకింద ఓఆయుర్వేద కంపెనీ యజమానికి నెల రోజుల జైలు శిక్ష లేదా రూ.10వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి జితేందర్ శుక్రవారం తీర్పు వెలువరించారు. జగిత్యాల జిల్లా డ్రగ్‌ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఉపేందర్ 2024 సంవత్స రంలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఓకంపెనీ ఆయుర్వేదిక్‌కు సంబంధించిన పలుమాత్రల లేబు ల్స్‌పై తప్పుదోవ పట్టించే ఆరోగ్య వాదనలు ఉన్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గుర్తించి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఆయుర్వేద మందుల కంపెనీ యజమానికి జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కొలుగూరి సుజిత్ (30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజిత్ కొద్ది రోజులుగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. కానీ ఆమె తనను ప్రేమించలేదని మనస్థాపంతో ఉంటున్నాడు. గురువారం హుజూరాబాద్ పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్‌సమీపంలో పురుగులమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైనవైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు సూర్యకిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

### నాటుబాంబు పెట్టిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ సైలెన్సర్‌లో నాటు బాంబు పెట్టిన ఓ యువకుడిని కోనరావుపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కథనం ప్రకారం మండ లంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన గురక ఎల్లయ్య తన ట్రాక్టర్ సైలెన్సర్‌లో గత ఏడాది డిసెంబర్ 29న రాత్రి సమయంలో నాటుబాంబు పెట్టారని ఫిర్యాదు చేశాడు. ఈసంఘటనపై విచారణచేపట్టగా వెంకట్రా వుపేట గ్రామానికి చెందిన మానుక మహిపాల్ అలియాస్ మహేష్ అనే వ్యక్తి నాటుబంబును పెట్టాడని తేలడంతో పాటు అతడి వద్ద ఒక నాటు బాంబును స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

దండేపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన అక్కల శేఖర్- సునీత అనే దంపతులకు తీవ్రగాయాలు అయ్యాయి. భార్యభర్తలు ఇద్దరుబైక్‌పై జన్నారం మండలం రోటిగూడ వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో బైక్‌ను ట్రాక్టర్‌ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపైఉన్న సునీత తలకు తీవ్రగా యాలయ్యాయి. శేఖర్‌కు చేయి విరిగింది. గాయపడిన వీరిని స్థానికులు 108లో చికిత్సకోసం లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం సునీతను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. సంఘటనస్థలా నికి దండేపల్లి పోలీసులు చేరుకొని ప్రమాదానికిగల వివరాలు సేకరించారు.

## ప్రత్యర్థుల ఆత్మీయ పలకరింపులు..

- మాజీ మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ నాయకుడు కేకే కలయికపై ఆసక్తి


రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆత్మీయంగా పలకరించుకుంటున్న కేటీఆర్, కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల/గంభీరావుపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్ర జ్యోతి): వారి మధ్య నిత్యం రాజకీయ విమర్శల పోరు కొనసాగుతుంది... మరోవైపు సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పరస్పరం పోటీపడుతారు... అయినా ఇద్దరూ ఆత్మీయంగా పలకరించుకోవడం అందరిలో ఆసక్తిని కలిగిం చింది. శుక్రవారం రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీ రావుపేట మండల కేంద్రంలో రెడ్డి సేవా సంఘం నూతనంగా నిర్మించిన గణపతి ధ్వజ యుక్త శ్రీ మహాకాళి అమ్మవారి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి బీఆర్ఎస్ రాష్ట్రవర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో ఒకరికి ఒకరు తారస పడగా మహేందర్ అన్నా బాగున్నావా.. అంటూ కేటీఆర్ పలకరించగా, ఫైన్ ఫైన్.. అంటూ మహేందర్ రెడ్డి బదులిచ్చారు. ఇద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. రాజకీయాలు పక్కనపెట్టి ఆత్మీయంగా పలకరించుకోవడం అక్కడున్న వారందరిలోనూ ఆసక్తిని కలిగించింది.

## గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత


పట్టుకున్న వ్యాన్‌తో పోలీసులు

మహదేవపూర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): గుట్కా, తంబాకు, పాన్‌మసాలా ప్యాకెట్లు తరలి స్తున్న వ్యాన్‌ను పోలీసులు మండల కేంద్రం శివారులో శుక్ర వారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్సై పవన్ తెలిపారు. పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా కాటారం వైపునుంచి వచ్చిన గూడ్స్‌వ్యాన్ అనుమానా స్పదంగా కనిపించింది. దీంతో దానిని ఆపి తనిఖీచేయగా భారీగా గుట్కా, తంబాకు (అంబర్), పాన్‌మసాలా ప్యాకెట్లున్న సంచులు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకుని వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలి పారు. 51 సంచుల్లో ఉన్న ఈ పాకెట్ల విలువ సుమారు రూ.7.92 లక్షలు ఉంటుందని చెప్పారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణానికి చెందిన వేల్పుల సంతోష్, షేక్ పర్వేజ్‌ను అదుపులోకి తీసుకున్నామని, కొంతకాలంగా ఈ ప్యాకెట్లను కిరాణాషాపులకు సరఫరా చేస్తున్నట్లు వారు ఒప్పుకోగా కేసు నమోదు చేశామని వెల్లడించారు.

### వాగులో పడి పెయింటర్ మృతి

ధర్మపురి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని తెనుగువాడ సమీపంలో గల వాగులో శుక్రవారం ప్రమాదవశాత్తు పడి ఎండీ హమీద్ (35) అనే పెయింటర్ మృతిచెందాడు. జగిత్యాలకు చెందిన హమీద్ ధర్మపురిలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు.

సాయంత్రం ఇంటి నుంచి బహిర్భూమి కోసం బయలుదేరిన హమీద్ కాలు జారి వాగులో పడి మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఉదయ్ కుమార్ పరిశీలించారు.

# విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా...

## జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో 'వాటర్ బెల్స్'కు శ్రీకారం..



వాటర్ బెల్ సమయంలో నీళ్లు తాగుతున్న విద్యార్థులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి చదువుకోవాలన్న లక్ష్యంతో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు 'వాటర్ బెల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధతోపాటు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమామాన్ని శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో చదువుతున్న 165 మంది విద్యార్థులందరూ ఇంటినుంచి పాఠశాలకు వచ్చి తిరిగి ఇంటికి చేరే వరకు వారితో కనీసం రెండు(ఉదయం, మధ్యాహ్నం) లీటర్ల నీటిని తాగించాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా రోజుకు రెండుసార్లు వాటర్ బెల్స్‌ను మోగించే ప్రక్రియను శ్రీకారం చుట్టారు. విద్యార్థులు వాటర్ బాటిల్స్ వెంట తెచ్చుకోవాలని, క్లాస్ ముగిసిన వెంటనే కొంత నీరు తాగాలనే కండిషన్ పెట్టారు. విద్యార్థులు ప్లాస్టిక్ బాటిళ్లతో వస్తుండడం గమనించిన ఉపాధ్యాయులు దాతల సహాయంతో స్టీల్ బాటిల్స్‌ను సమకూర్చారు. బెల్ మోగిన వెంటనే విద్యార్థులందరు కూడా పాఠశాల అవరణలోకి వచ్చి నీటిని తాగాల్సి ఉంటుంది. వీరితోపాటు ఉపాధ్యాయులు కూడా నీటిని తాగుతున్నారు.



### అనుభవాల పాఠాలు..

హెచ్ఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అనురాధ గతంలో ఎదుర్కొన్న ఇబ్బందులతో పాటు ప్రసార మాధ్యమాల్లో వచ్చిన కథనాలు వల్ల నీటిని తక్కువగా సేవించడం వల్ల కొలెస్ట్రాల్ పెరుగుతుందని తెలుసుకున్నారు. దీంతో తాను పనిచేసే చోట విద్యార్థులకు అవసరమైనంత నీరు తాగాల్సిన ఆవశ్యకతను వివరించారు. అంతేకాకుండా విద్యార్థులు ఖచ్చితంగా నీరు సేవించేందుకు అవసరమైన వాతావరణమూ కల్పించాలని భావించారు. తాను చేస్తున్న ఈ ప్రయత్నానికి తనతో పాటు సహచర ఉపాధ్యాయ బృందం కూడా చేతులు కలపడంతో సక్సెస్ అవుతున్నానని చెప్పారు హెచ్ఎం అనురాధ.

### పిల్లలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో..

**జోగినపల్లి అనురాధరావు, ప్రధానోపాధ్యాయురాలు జిల్లెల్ల**



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అనారోగ్యంతో పాటు చదువుపై అనాసక్తితో ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించాను. వాతావరణంలో ఏర్పడిన మార్పులవల్ల వారం రోజుల నుంచి విద్యార్థులు ప్రార్థన సమయంలో పడిపోతుండడంతో గమనించి నీళ్ల తాగడం లేదని తెలుసుకున్నాను. విద్యార్థు లతో నీళ్ల తాగించాలనే ఉద్దేశంతో 'వాటర్ బెల్స్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టాను.

# పంట చేలల్లో సౌర విద్యుత్




- 'పీఎం కుసుమ్'తో
- 70శాతం రుణాలు
- జిల్లాలో 100 మెగావాట్ల ఉత్పత్తికి నిర్ణయం
- ఈనెల 22 వరకు దరఖాస్తుల స్వీకరణ
- మహిళా సంఘాలకు ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

రైతులు పంట పొలాల్లో ఆహారధాన్యాలే కాదు.. ఇక నుంచి సౌర విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సురక్షా ఊర్జ ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకం అమలు ద్వారా రైతుల పంట పొలాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) దీని అమలుకు నోడల్ ఏజెన్సీగా ఉన్నది. ఈ సంస్థ రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. రైతులకు అదనపు ఆదాయవనరులను సమకూర్చడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ఈ పథకం కింద రాష్ట్రంలో 4,000 మెగావాట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు.

ఇందులో 3,000 మెగా వాట్ల విద్యుత్‌ను రైతులు, సమష్టి, వ్యవసాయ క్షేత్రాల నిర్వహణ సంస్థలు, రైతుల సమూహం ద్వారా, 1000 మెగావాట్లను మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టు కున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 400 మెగావాట్లు, వ్యక్తిగతంగా కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో వందేసి మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. ఒక్కో రైతుకు రెండు మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కల్పించా లని నిర్ణయించారు. ఒక్కో జిల్లా లో రెండేసి మహిళా సంఘాలను ఎంపిక చేసి వాటి ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని మహిళా సంఘాలకు అందుకు అవసరమైన మేరకు ప్రభుత్వ స్థలాలను సమకూర్చాలని నిర్ణయించారు.

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మహిళా సంఘాలకు యూనిట్లను కేటా యిస్తున్నారు. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దత్తోజిపేట, వీణవంక మండలం గన్నుముకుల, పెద్దపల్లి జిల్లాలో మంథని మండలం సిరిపురం, కాల్వ శ్రీ రాంపూర్ మండల కేంద్రంలో, జగిత్యాల జిల్లాలో తాటిపల్లి, వెల్గటూర్ మండలానికి చెందిన స్తంభంపల్లిలో మహిళా సంఘాల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని నిర్ణయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రాంతాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నది.



### యూనిట్ల స్థాపన ఇలా..

500 కిలో వాట్స్ (0.5మెగావాట్స్) నుంచి 2000 కిలో వాట్స్ (2 మెగావాట్స్) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతిస్తారు. అర మెగావాట్ ప్లాంట్ నెలకొల్పేందుకు 2 ఎకరాలు, ఒక మెగావాట్ ప్లాంట్ ఏర్పాటుకు 4 ఎకరాలు, 1.5 మెగా వాట్ ప్లాంట్‌కు 6 ఎకరాలు, 2 మెగావాట్ ప్లాం ట్లకు 8 ఎకరాల భూమి అవసరమవుతుంది. వీటిని స్థాపించేందుకు అర మెగావాట్ ప్లాంట్‌కు సుమారుగా కోటి 5వేల రూపాయలు, ఒక మెగావాట్ ప్లాంట్‌కు 3 కోట్లు, 1.5 మెగావాట్ ప్లాంట్‌కు 4 కోట్లు, 2 మె.వా. ప్లాంట్‌కు 6 కోట్లు రూపాయలు అవసరముంటాయి.

ఇందులో 70శాతం జాతీయ బ్యాంకుల నుంచి రుణంగా సమకూరుస్తారు. లబ్ధిదారులు 30శాతం సొమ్మును భరించాల్సి ఉంటుంది. మహిళా సంఘాలు 25 నుంచి 30 లక్షల రూపాయలు చెల్లిస్తే ఏ కెపాసిటీ ప్లాంట్‌నైనా నెలకొల్పుకోవచ్చు. మిగతా సొమ్మును బ్యాంకు రుణంగా సమకూరు స్తారు. అర మెగావాట్ ప్లాంట్ ద్వారా నెలకు 72,000 యూనిట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఒక మె.వా. ప్లాంటులో 1,44,000 యూనిట్లు, 1.5 మెగావాట్ ప్లాంట్‌లో 2,16,000 యూనిట్లు, రెండు మెగావాట్ ప్లాంటుల్లో 2,82,000 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఉత్పత్తి అయిన విద్యుత్‌కు యూనిట్‌కు 3.13 రూపాయలు చెల్లించి డిస్కంలు కొనుగోలు చేస్తాయి. అర మెగా వాట్ ప్లాంట్ నిర్వాహకులకు నెలకు 2,25,360 రూపాయలు, 1 మెగావాట్ ఉత్పత్తిదారులకు 4,50,720 రూపాయలు, 1.50 మెగావాట్ ఉత్పత్తి దారులకు 6,76,080 రూపాయలు, 2 మెగావాట్ ఉత్పత్తిదారులకు 9,01,440 రూపాయలు ఆదాయంగా సమకూరుతాయి.

25 సంవత్సరాల పాటు ఈ సౌర విద్యుత్ ఉత్పత్తిద్వారా సమకూరే ఆదాయంపై ఎలాంటి టాక్సు విధించరు. రైతులు 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఉన్న 5 కిలో మీటర్ల పరిధిలో సౌర విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పుకొనేందుకు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. తమ పంట పొలాల నుంచి సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కోసం రైతు లు లైన్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు ఒక కి.మీ. లైన్‌కు 6.50 లక్షలు అవసరమవుతాయి. మహి ళా సంఘాలకు మాత్రం ఈ లైను నిర్మాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది.

### దరఖాస్తుల ఆహ్వానం

రైతులు ఒక మెగావాట్ సౌర విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నెలకొల్పేందుకు చేసుకునే దరఖాస్తుకు 6వేల రూపాయలను రుసుముగా చెల్లించాలి. ఆపైన ఎంత ఉత్పత్తి పెరిగినా దరఖాస్తు రుసుము 12వేలు ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేది ఫిబ్రవరి 22. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలో 13.5 మెగావాట్ యూనిట్ల స్థాపనకు 11 దరఖాస్తులు, పెద్దపల్లి జిల్లాలో 14.5 మెగావాట్ యూనిట్లకు 11 దరఖాస్తులు, జగిత్యాల జిల్లాలో 5 మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల కోసం 6 దరఖాస్తులు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 దరఖాస్తులు వచ్చాయి. వీరు 6 మెగావాట్స్ విద్యుత్ ఉత్పత్తికి సంసిద్ధత తెలుపుతూ దరఖాస్తు చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జిల్లాకు 100 మెగావాట్ చొప్పున 400 మెగావాట్ వరకు సౌర విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు యూనిట్ల స్థాపనకు అవకాశముండగా ఇప్పటి వరకు 39 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి దరఖాస్తులు వచ్చాయి.

# ఓమన్‌లో కన్నుల పండువగా రాజరాజేశ్వర స్వామి కల్యాణం

## పట్టు వస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశమైన ఓమన్‌లో శ్రీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఓమన్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో మస్కట్‌లోని బర్క్ సిటీలో వేదపండితులు శ్రీరాజరాజేశ్వర స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజ రాజేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవం తొలిసారిగా మస్కట్‌లో నిర్వహించడం అభినందనీయమన్నారు. గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికులు తమ వేదనను మరి చిపోయి, దేశ సంస్కృతిని విదేశాల్లో పరి రక్షిస్తూ బ్రహ్మోత్సవాలు, కల్యాణ మహో త్సవాలు, పండుగలు నిర్వహించడం గర్విం చదగిన విషయమన్నారు. గల్ఫ్‌లోని తెలం గాణ కార్మికుల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకు వెళుతున్న ఆది శ్రీనివాస్

### ఆలోచన అదిరే..

# కోతులు బెదిరే..



ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వనాలు వీడిన వానరాలు గ్రామాలతో పాటు పంట పొలాల్లో హంగామా చేస్తున్నాయి. పంటలను సాగు చేసిన రైతులకు కోతుల బెడద తప్పడం లేదు. పంటను కాపాడుకునేందుకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రైతు పారిపెల్లి సంజీవరెడ్డికి ఓ ఆలోచన తట్టింది. గ్రామ శివారులో తనకున్న 2.50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన వరి చేనును కోతుల నుంచి రక్షించుకునేందుకు కొండముచ్చు చిత్రపటాలను అక్కడక్కడా ఏర్పాటు చేశాడు. సుమారు రూ.800 వెచ్చించి రెండు ఫ్లెక్సీలను పొలంలో ఉంచడం వల్ల కోతులు బెదిరి పారిపోతున్నాయని రైతు సంజీవరెడ్డి పేర్కొంటున్నాడు. నిత్యం పొలం వద్ద కాపలా ఉండాల్సిన పని తప్పిందని పేర్కొంటున్నాడు.

# రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడ రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్యూలైన్ల ద్వారా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

# ర్యాలీల హోరు.. నామినేషన్ల జోరు

- పట్టభద్రుల స్థానానికి 28
- ఉపాధ్యాయ స్థానానికి 2
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అభ్యర్థులు



నామినేషన్ల ఊరేగింపులో భాగంగా తెలంగాణచౌక్‌లో అభ్యర్థుల ర్యాలీ

కరీంనగర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు గడువు సమీపిస్తుం డడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేశారు. శుక్ర వారం ఒక్కరోజే పట్టభద్రుల స్థానానికి 28 మంది, ఉపాధ్యా య ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరు మొత్తం 30 నామినేషన్లను దాఖలు చేశారు. పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులు పోటాపోటీగా భారీ ర్యాలీగా వచ్చిన నామినేషన్లు వేయడంతో నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం కనిపించింది. పట్ట భద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ అధ్యక్షు డు బాస సత్యనారాయణరావు, మాజీ మేయర్ సునీల్‌రావుతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనం తరం నామినేషన్ పత్రాలను అందజేశారు.

అలాగే పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ శ్రేణులతో కలిసి మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలె క్టరేట్‌కు చేరుకొని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాల ను అందజేశారు. స్వతంత్ర అభ్యర్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రస న్న హరికృష్ణ ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలా బాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పట్ట భద్రు లు, అభిమానులతో కలిసి ఎస్సారఆర్ కళాశాల నుంచి డప్పు చప్పుళ్ల, ఒగ్గడోలు బృందాలు, కళాకారుల ఆటపాటలతో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని నామినేష న్ అందజేశారు. డీఎస్పీ పదవికి రాజీ నామా చేసిన మదనం గంగాధర్ కోర్టు సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి పట్టభద్రు ల ఎమ్మెల్సీ స్థానానికి నామి నేషన్ వేశా రు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి పీఆర్టీ యూ నాయకుడు వంగ మహేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నా యకులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీగా వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేయగా, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు తరఫున నామినేషన్ వేయించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కరీంనగర్‌కు చెందిన దయ్యాల ఓంప్రకాశ్, డాక్టర్ బండారి రాజ్ కుమార్, న్యాం తాబాద్ జనార్ధన్,సంకినేని మధుసూధన్ రావు, మెక్కు హేమలత, మహ్మద్ ముస్తాక్ అలీ,మంథని మండలం పుట్ట పాకకు చెందిన సిహెచ్.పురుషోత్తం, ఇప్పటి వరకు 58 మంది నామినేషన్లు వేయగా పట్టభద్రుల స్థానానికి 49 మంది, టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 9 మంది నామినేషన్లు వేశారు.

## సోనియాకు గిఫ్టుగా అందిస్తాం

### 10న నరేంద్రుడి నవరత్నాల పేరిట అజెండా ప్రకటిస్తా

### కరీంనగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి




నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కార్య కర్తలు, నాయకులు, నా శ్రేయోభిలాషుల అండదండలతో కరీంనగర్ శాసనమండలి పట్టభద్రుల స్థానాన్ని హస్తగతం చేసుకొని, పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి బహుమతిగా అందిస్తానని ఆ పార్టీ నుంచి పట్టభద్రుల కరీంనగర్ స్థానం అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయ న కుటుంబసభ్యులతో కలిసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 10న టీపీసీసీ అధ్యక్షు డు మహేందర్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్‌రెడ్డితోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మరో సెట్ వేయనున్నట్లు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

### బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి

సుభాష్‌నగర్ : రాష్ట్రంలో గత ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగి స్తోందని బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డి ఆరోపించారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, బాస సత్యనారాయనతో కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించ కుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడు తూ, ప్రజా పాలన అని చెప్పి రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తోందని విమర్శించారు.



నామినేషన్ వేస్తున్న ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి

## కామన్‌మెన్‌కు కార్పొరేట్ శక్తికి మధ్య ఎన్నిక

### పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

సుభాష్‌నగర్ : ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక కామన్‌మెన్‌కు కార్పొరేట్ శక్తికి మధ్య జరుగుతున్న ఎన్నిక అని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ఎస్ఆర్ఆర్ కాలేజ్ నుంచి డప్పు, ఒగ్గుడోలు వాయిద్యాలు, నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామి నేషన్ వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లా డారు. తన నామినేషన్ కార్యక్రమానికి నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి పట్టభద్రులు తరలి వచ్చారన్నారు. జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడు తూ ప్రసన్నహరికృష్ణ తన 19 సంవత్సరాలు సర్వీసు ఉన్నప్పటికీ ఉద్యోగానికి రాజీనామా చేశారని తెలిపారు.

## పీఆర్టీయూటీఎస్‌తోనే సమస్యలు పరిష్కారం

### పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూటీఎస్ తోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి, పీఆర్టీయూటీఎస్ అధికార అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి స్థానిక పద్మనాయక కల్యాణ మండపం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకొని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామి నేషన్ వేశారు. అనంతరం ప్రెస్‌భవన్‌లో ఆయన ఉపాధ్యాయ, అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి వంగ మహేందర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి ఉన్నారు.



నామినేషన్ అందజేస్తున్న పీఆర్టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

## నిరంతరం కృషితోనే లక్ష్యం సాధ్యం


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నిరంతర కృషి, పట్టుదలతోనే లక్ష్యం సాధ్యమవుతాయని జగిత్యాల అటానమస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ అన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని మెట్‌పల్లి మండలం రామలచ్చక్కపేట అల్లూరి సీతారామరాజు తండాకు చెందిన గుగ్లావత్ రాజమణి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం సాధించింది. శుక్రవారం కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణతో పాటు పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కళాశాల 2021 డిగ్రీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థినీ రాజమణి బ్యాంకు ఉద్యోగం సాధించడం అభినంద నీయమన్నారు. రాజమణి కృషి వెనుక కళాశాల అధ్యాపకుల కృషి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రమోద్ కుమార్, చంద్రయ్య, వాసాల వరప్రసాద్, సంగీత రాణి పాల్గొన్నారు.

### నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకోవాలి

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో కొందరు జువెలరీ దుకాణాల యజమానులు ప్రజలను, స్వర్ణకారులను మోసం చేస్తూ నాణ్యత లేని బంగారాన్ని అమ్ముతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్వర్ణకారులు డిమాండ్ చేశారు. జగిత్యాల పట్టణ స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని స్వర్ణకారులు దుకాణాలు బంద్ చేసి నిరసన తెలియజేశారు. జువెలరీ దుకాణాల యజమానులు నాణ్యతలేని బంగారాన్ని విక్రయిస్తు ప్రజలను, స్వర్ణకారులను మోసగిస్తున్న విషయం సాక్ష్యాధారాలతో రుజువైందని స్వర్ణకార సంఘం నాయకులు గన్నేరువరం బుచ్చయ్య ఆరోపించారు. ఈ నిరసన కార్యక్రమంలో స్వర్ణకార సంఘం నాయకులు సత్యనారాయణ, కనపర్తి రవి, సంతోష్, కత్తురోజు గిరి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయురాలికి సన్మానం

వెల్గటూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పైడిపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేసి 317 బదిలీలలో భాగంగా స్పౌజ్ కోటాలో బదిలీపై వెళ్లిన శ్రీవాణిని శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసి ఆగమయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల విద్యార్థులకు అందించిన సేవలను కొనియాడారు.

# ఎన్‌హెచ్63 పనులు త్వరగా పూర్తి చేయాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్‌హెచ్63 పనులు త్వరగా పూర్తి చేయాలనికలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంను, ఎన్‌హెచ్63 పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్యాల యంలో భూ సేకరణ రికార్డులను పరిశీలించారు. మెట్‌పల్లి డివిజన్ పరిధిలో ఎన్‌హెచ్ 63 రోడ్డు పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు, నివాసం ఉన్న వారు ఏర్పాటు చేసుకున్న వసతులపై ప్రభుత్వం నష్టపరిహారం కింద చెల్లించాల్సిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటికి చెల్లించాల్సిన నష్ట పరిహారం అంచన విలువలను ఆయా శాఖల అధికారుల సమన్వయంలో కలిసి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

### అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కోరుట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 63 నిర్మాణం కోసం చేపడుతున్న భూ సేకరణను అధికారులు సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జాతీయ రహదారి 63 కోసం సేకరిస్తున్న భూ వివరాలను కలెక్టర్ పరిశీలించారు. భూ సేకరణ నమోదు వివరాలను పరిశీలించి ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూమి, ఇండ్లు, కట్టడాలు, చెట్లు, బోర్లు, పైప్‌లైన్‌తో పాటు ఇతర నిర్మాణాలను పరిశీలించి వాటికి చెల్లించాల్సిన నష్టపరిహారం అంచనా విలువలను తయారు చేయాలని సూచించారు. అనంతరం పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలలో జాతీయ రహదారికి కేటాయించిన భూముల సర్వేను పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

జగిత్యాల, అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా సంక్షేమాధికారి బొనగిరి నరేష్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రలోని జ్యోతి పాఠశాల ఐఐటి అకడామీ విద్యార్థులకు శుక్రవారం పాఠశాల ఒలింపిక్స్ పేరిట నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వలన శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక, రజిత, అజిత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న జిల్లా సంక్షేమాధికారి నరేష్

# బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన నృసింహస్వామి ఆలయం


నల్లగొండలో ముస్తాబైన ఆలయం

కొడిమ్యాల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని నల్లగొండ నృసింహస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శనివారం నుంచి జరిగే ఉత్సవాలకు ఎగువ, దిగువ ఆలయాలకు సున్నాలు, రంగులు వేశారు. పరిసరాలను చెత్త చెదారం లేకుండా సిబ్బందితో పనులు చేయించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి, వైద్య సౌకర్యంతో పాటుగా నీడ సౌకర్యం కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేయించారు. శుక్రవారం ఆలయ ఈవో ఉడుతల వెంకన్న మాట్లాడుతూ తాగు నీటి కోసం 3 ట్యాంకులు, 20 నల్లాల ద్వారా సౌకర్యం కలిపించనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో, జాతర పరిసరాలలో అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. గుట్టపై స్వామి వారిని దర్శించుకోవటానికి వెళ్లే భక్తులకు ఘాట్ రోడ్డుపై మట్టిని పోయించి చదును చేయించామన్నారు. స్వామి వారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటు చేస్తామన్నారు.

కోనేరు శుద్ధి చేయటంతో పాటుగా ఉత్సవాల నిర్వహణకు 15 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలిగించడానికి ప్రత్యేకంగా పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

### ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది విష్ణుదాస్ శంకర్ రావు బుధవారం మరణించగా ఆయన సతీమణి పద్మబాయిని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన శంకర్ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట ప్రముఖ వ్యాపార వేత్త మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, గంగాధర్, దాసు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### లీజును రద్దు చేయాలి

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి కొత్త బస్టాండ్ సమీపంలోని సొసైటీ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న భారీ భవనంలో గుట్టుగా ఇచ్చిన లీజు అగ్రిమెంట్‌ను రద్దు చేసి నూతనంగా టెండర్లు పిలవాలని శుక్రవారం మాజీ సింగిల్‌విండో చైర్మన్ అల్లూరి మహేందర్ రెడ్డి జగిత్యాల జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భవనం బిజినెస్ ఏరియాలో ఉందని మళ్లీ టెండర్లు పిలిస్తే సొసైటీకి ఎక్కువ ఆదాయం వస్తుందని, వెంటనే రద్దు చేసి టెండర్లు మళ్లీ పిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

కథలాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని సత్యానంద ఆశ్రమాల పీఠాధిపతి (ఇనుమడు, నెల్లూరు) శ్రీశ్రీశ్రీ శ్రీహరి తీర్థ స్వామి అన్నారు. మండలంలోని చింతకుంటలో భగవాన్ శ్రీ సత్యానంద మహర్షి ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహాసభల స్వర్ణోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రవచనాలు చేశారు. భగవద్గీతలోని శ్లోకాలు మానవాళికి ఎంతో ఉపయుక్తమన్నారు. కార్యక్రమంలో శ్రీ కమలా నంద భారతీ స్వామి, శ్రీ విరజానంద తీర్థ స్వామి, శ్రీశ్రీశ్రీ మాతా పరమేశ్వరానందగిరి స్వామి, విశోక తీర్థ స్వామి, రామచంద్రశర్మ పాల్గొన్నారు.

## లక్ష్యం నెరవేరేనా..?

(5వ పేజీ తరువాయి)

సమయం మాత్రమే మిగిలి ఉంది. మరో వైపు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతున్న తరుణంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయితే పంచాయతీ అధికారులు, సిబ్బంది బిజీ కానున్నారు. ఈ లోపు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాల్సిన అవసరముంది.

### వంద శాతం లక్ష్యం సాధించడానికి చర్యలు

-గౌతమ్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం లక్ష్యం సాధించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పన్నుల వసూళ్లపై డీఎల్‌పీవోలు, ఎంపీవోల ద్వారా కార్యదర్శులకు తగిన సూచనలు చేశాం. మార్చి 31వ తేదీ వరకు వంద శాతం ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. వసూలైన ట్యాక్స్‌ను అత్యవరాలకు వినియోగిస్తున్నాము.

### క్రీడల్లో కొడిమ్యాల విద్యార్థుల ప్రతిభ

కొడిమ్యాల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): బేటీ బజావో బేటీ పడావో క్రీడోత్సవాల సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనపర్చిన కొడిమ్యాల జట్టు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయేంద్ర, పీడీ బూట్ల రాజమల్లయ్య శుక్రవారం తెలిపారు. కబడ్డీలో ఎం.రుచిత, కె. అనుష్క, ఎన్. ప్రవళిక, వాలీబాల్ క్రీడల్లో ఎం. లౌక్య కె. అనుష్క, ఐ.అఖిల, ఖోఖో క్రీడల్లో పి.పూజ, ఎం.పల్లవి ఎంపికైనట్లు వారు తెలిపారు. అథ్లెటిక్స్ రన్నింగ్ విభాగంలో ఎం.పల్లవి, ఐ.అఖిల, లాంగ్ జంప్‌లో ఎం.పల్లవి, బి.ఆమని ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వీరంతా జగిత్యాలలోని స్వామి వివేకానంద మిని స్టేడీయంలో శనివారం నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

### ఘనంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిం చిన వేదపండితులు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజపతాదివాసం, ధ్వజారోహనం, బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. దేవాల యంలో ఉత్సవ మూర్తులకు పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, శ్రీ వెంకటేశ్వ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబును సన్మానిస్తున్న నాయకులు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన రాచకొండ యాదగిరిబాబును శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ బీజేపీ నాయకులు సురభి నవీన్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, బీజేపీ నాయకులు సుంచు రణధీర్, బత్తుల శ్రీనివాస్, సదాశివం, రమేష్, మహేష్, నాగరాజు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

### అబాకస్‌లో విద్యార్థి ప్రతిభ

కోరుట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : విశ్వం ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ జాతీయ స్థాయి పరీక్షలో పట్టణంలోని రైజింగ్ స్టార్ విద్యార్థి శ్రీహర్షరెడ్డి ప్రతిభ కనపరిచి 3వ ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కూడేల్ రాజేంద్రప్రసాద్ శుక్రవారం తెలిపారు. శ్రీహర్షరెడ్డిని పాఠశాల కరస్పాండెంట్ కుడేలు రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ లిఖిత, డైరెక్టర్ల్ షాహజ్ బేగం, చిప్ప మోహన్ సన్మానించారు.

### మూగజీవాల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాల ఆరోగ్యం పట్ల రైతులు, పశు పోషకులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి మనీషాపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని గొర్రెలకు పోచమ్మ వ్యాధి నివారణ టీకాలు వేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూగజీవాలకు వైరస్ సోకినప్పుడు జ్వరం, కంటి, ముక్కు స్రావాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఏర్పాడి, శరీరం అంత బొబ్బలు ఏర్పడి సరిగా మేత తీసుకోక జీవాలు నీరసించి చనిపోయే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి సోకిన జీవాల నుంచి ఇతర జీవాలకు ప్రత్యేకంగా వైరస్ లాలాజలం, మూత్రం, మలం, చర్మం మీద వచ్చే స్కాబ్స్, కీటకాలు, ఈగల వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. వైరస్ సోకిన వెంటనే మూగజీవాలను గమనించి వైద్యం అందించాలన్నారు. మూగు నెలలు దాటిన జీవాలకు టీకాలు వేసిస్తూ షెడ్లను శుభ్రంగా ఉంచడం, కీటకాలు, ఈగలు రాకుండా పొగ వేయడం, పురుగులమందులను పిచికారి చేసి వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సిబ్బంది రమణయ్య, రైతులు, యాదవులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆవులను కట్టి వేసిన మున్సిపల్ అధికారులు

-ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

ధర్మపురి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో ఆవుల బెడద వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్న సందర్భంగా మున్సిపల్ అధికారులు పాత పోస్టాఫీస్ ఖాళీ స్థలంలో శుక్రవారం వాటిని కట్టి వేశారు. 'పశువుల బెడదతో ఇక్కట్లు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టణంలోని అన్ని వీధుల్లో తిరుగుతున్న ఆవులను పట్టుకుని మున్సిపల్ పక్కనే ఖాళీ స్థలంలో తాత్కాలికంగా బందెల దొడ్డి ఏర్పాటు చేసి అందులోకి వాటిని తరలించారు. ఆవుల యజమానులకు సమాచారం అందించి తీసుకువెళ్లాలని సూచించారు. కొందరు యజమానుల వచ్చి ఆవులను తీసుకు వెళుతుండగా కొంత వరకు జరిమానా విధించారు. ఇక ముందు ఆవులను బయట వదిలి పెట్టబోమని ఒక లేఖను రాయించుకున్నారు. ఆవుల యజమానులు వచ్చి తీసుకు వెళ్లకుంటే గోశాలకు పంపిస్తామని మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ తెలిపారు.

### పాఠశాల బోర్‌వెల్‌కు మరమ్మతు

వెల్గటూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని బోర్‌వెల్‌కు శుక్రవారం మరమ్మతు చేశారు. బోర్ వెల్ మోటార్ కాలిపోవడంతో ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రామగిరి నందయ్య దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి ద్వారా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన విప్ బోర్ మోటార్ పంపించి ఫిటింగ్ చేయించారు. కార్యక్రమంలో కుమ్మరి ఎల్లయ్య, చొప్పదండి ప్రశాంత్, ముద్దం దేవయ్య, చొప్పదండి పోచమల్లయ్య పాల్గొన్నారు.

### మండల పాస్టర్ల సమావేశం

రాయికల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని జీసస్ నూతన యెరూషలేము చర్చిలో శుక్రవారం మండల పాస్టర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం మండలం, జిల్లా, దేశం కోసం క్షేమ ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ అధ్యక్షుడు బుడుగు లాజరస్, మండల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు దూలూరి ప్రసాద్, రవి, తిమోతి, దూలూరి ప్రసాద్, హనోక్, బర్నాబాస్, ఎజ్రా, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# పీహెచ్‌సీ ఏర్పాటుకు ఎదురుచూపులు

రాయికల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రజలు ఎదురుచూస్తున్నారు. పేరుకే మేజర్ పంచాయతీ అయినా వసతులు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. ఆరోగ్య ఉపకేంద్రం మాత్రమే ఉండటంతో నిత్యం మెరుగైన వైద్యసేవల కోసం రోగులు జగిత్యాల, రాయికల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. రాయికల్ మండలంలో 32 గ్రామాలు ఉండగా 65 వేల జనాభా ఉంది. రాయికల్‌లో 30 పడకల ఆసుపత్రి ఉండగా, ఒడ్డెలింగాపూర్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. రాయికల్ మండల కేంద్రం తర్వాత అల్లీపూర్, ఇటిక్యాల మేజర్ గ్రామపంచాయతీలు. అల్లీపూర్‌లో సుమారు 8500 జనాభా ఉండగా గ్రామంలో కేవలం ఆరోగ్య ఉపకేంద్రం మాత్రమే ఉండగా ఇద్దరు ఏఎన్ఎంలు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజు ఉప కేంద్రానికి వివిధ ఆరోగ్య సమస్యలపై సుమారు 40 మంది వరకు రోగులు వస్తున్నారు. గ్రామంలో ఆయుర్వేద వైద్యశాల ఉండగా ఇందులో 30 మంది వరకు సేవలు వినియోగించుకుంటున్నారు. మాత్రలతో తగ్గే వ్యాధులకు గ్రామంలో సేవలు అందుతున్నప్పటికీ ఇతర సేవల వినియోగానికి గ్రామంలో అత్యవసరంగా ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రసూతికోసం, ఇతర రోగాలు వ్యాపించినప్పుడు వైద్యసేవల కోసం 10 కిలోమీటర్ల దూరంలోని జగిత్యాల, రాయికల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. రోగులకు దూరభారంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఉప కేంద్రాన్ని ఆధునికరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చి వైద్యుడిని నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అల్లీపూర్, కిష్టంపేట, సింగరావుపేట, శ్రీరాంనగర్, కుర్మపల్లి, ఆలూరు, రాజనగర్ తదితర గ్రామాల్లోని సుమారు 20 వేల జనాభాకు ఆస్పత్రి ఉపయోగకరంగా ఉంటుంది. గ్రామంలో ఆస్పత్రి నిర్మాణం కోసం గ్రామానికి చెందిన దాత ఎకరం భూమిసైతం పంచాయతీకి అప్పగించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మంజూరు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అల్లీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

### ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం

గంగారెడ్డి, మాజీ సర్పంచ్, అల్లీపూర్



అల్లీపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు జనాభాతో పాటు స్థలం అనుకూలంగా ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. గ్రామంలో వైద్యశాల లేకపోవడంతో నిత్యం గ్రామస్తులు రాయికల్, జగిత్యాల వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రి మంజూరు చేస్తే పేదలకు వైద్యసేవలు అందుతాయి.

### ఆసుపత్రి మంజూరు చేయాలి

రమేష్, మాజీ సర్పంచ్, కిష్టంపేట



అల్లీపూర్‌లో వైద్యసేవల కోసం ఆస్పత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. ఆస్పత్రి మంజూరుతో సుమారు ఆరు గ్రామాల ప్రజల ఇబ్బందులు తీరుతాయి. అల్లీపూర్‌లో ఆస్పత్రి లేక పట్టణాలకు వెళ్లాలంటే పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

### సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు

మల్యాల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మల్యాల కొత్తపేట ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ ఏర్పాటును నిలిపివేయాలని స్థానికులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో విన్నవించుకున్నారు. టవర్ ఏర్పాటుతో రేడియోషన్ లాంటి ఇక్కట్లు పడాల్సి వస్తుందని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పనులు చేపట్టారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యే పంచాయితీ ఈవో శ్రీకాంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులు నిలిపివేయించాలని ఆదేశించారు.

### బాధిత కుటుంబాలకు పరామర్శ

ముత్యంపేటకు చెందిన పొనగంటి అంజయ్య, మల్యాల నరేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. తాజా మాజీ ఎంపీటీసీ దొంగ అనితను కూడా పరామర్శించారు.

# పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం

-కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో అంటువ్యాధులు దరిచేరవని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వివిధ వార్డులలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఇళ్లలో నిలువ ఉన్న నీటిని తొలగించి శుభ్రపరిచారు. పలు వార్డులలో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలలో అంటువ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇండ్లలో నిలువ ఉన్న నీటితో దోమలు ఉత్పన్నం అయి రోగాలు వస్తామన్నారు. నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారులు, కారాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.


నిలువ ఉన్న నీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

### విద్యార్థులకు ప్రతిభ పరీక్ష

రాయికల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ప్రణుతి జూనియర్ కళాశాలలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రతిభ పరీక్ష నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో సుమారు 500 మంది విద్యార్థులు పరీక్ష రాశాని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతి సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు నిర్వహిస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి విద్యార్థులకు బహుమతులు పాఠశాల స్థాయిలో అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, కళాశాల కరస్పాండెంట్ శివప్రసాద్, ప్రిన్సిపాల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### వర్గీకరణకు మద్దతు తెలిపిన నాయకులకు క్షీరాభిషేకం

భీమారం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు మద్దతు తెలిపిన నాయకులకు శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో పాటు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితర నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భీమారం మాదిగ సంఘం మండల అధ్యక్షుడు దువాస గంగాధర్, ఉమ్మడి మేడిపల్లి మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు బంగారు దీపక్, మేడిపల్లి మాజీ ఎంపీటీసీ దాసరి శంకర్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎనుగంటి హరీష్, ఎర్రల రాజేష్, లింగంపల్లి గణేష్, దువాస నారాయణ, లక్ష్మణ్, బురాన్ పాల్గొన్నారు.

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

కొడిమ్యాల, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జి.రమేష్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఎస్సై సందీప్‌తో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయించాలని ఈవో వెంకన్నను ఆదేశించారు. భక్తులకు అవసరమైనన్ని